శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం

# పరుగు

ఏమిటీ జీవితం? ఇంత చిత్రమైనదేమిటి? ఇంత అర్థంకానిదీ అయోమయమూ ఏమిటి?

నిన్నటికి నిన్న ఓ కోరిక. ఆ వాంఛా సాఫల్యంకోసం వెర్రిగా ఆత్రతపడడం.

ఇవాళ—అదే కోరిక—తీరుతూంటే — పాముకోర గుండెల్లో దిగుతూ విషం చిమ్ముతున్నంత విపరీత వేదన! తన కోరికే తనతో క్రూరంగా ఆటలాడుతూ వెక్కిరిస్తూ మనిషీ. నీ బుద్ధీ జ్ఞానమూ అల్పాతి అల్పంసుమా అని ఛెళ్లున కొరడా ఝుళిపించడం వీపుమీద!

జీవితం చదరంగమే కావొచ్చు. మనిషి — పావే కావొచ్చు. కాని—మరీ యింత దారుణమా! ?

* * *

"పార్వతమ్మగారూ! ... ఉత్తరం..." మిట్టమధ్యాహ్నపు ఎండలో చల్లగాలిలాగ పోస్టుమన్ పిలుపు.

అంతవరకూ బాధించిన నడుమునొప్పి ఎక్కడ కెగిరిపోయిందో ఒక్కసారి? తటాలున లేచి వచ్చారు పార్వతమ్మ. "మజ్జిగ తీసుకుందువుగాని. దాహం తీరుతుంది. ఎంత ఎండగా ఉంది..." అంటూ—ఉత్తరం అందుకోకుండానే లోపలికి వెళ్లి పెద్ద గ్లాసుతో తేటమజ్జిగ తెచ్చారావిడ. తాగి — అడిగించుకోకుండానే ఉత్తరం చదివాడు పోస్టుమన్. రఘు—కులాసాగానే ఉన్నాడుట. శ్యామలకూడా బాగానే ఉందట. విశాఖపట్నంనుంచి విజయవాడ బదిలీ కాబోతున్నట్లు వ్రాశాడు.

అంటే—మరో రెండువందలమైళ్ల దూరంగా వెళ్తున్నాడన్నమాట! ఎక్కడి టెక్కలి, ఎక్కడి విజయవాడ! మనుషుల్ని ఎందుకిలా దూరదూరంగా విసిరేస్తూ ఉంటాడో దేముడు? ఉత్తరంలో మాటవరసకయినా రాయలేదు తనని రమ్మనీ, వొచ్చి తమతోనే ఉండమనీ. ఆ భావన స్ఫురించేసరికి పార్వతమ్మ కళ్లల్లోకి నీళ్లు వొచ్చేశాయి. ఇక ఆమె వేయబోయే ఛాదస్తపు ప్రశ్నలు పోస్టుమాన్‌కి తెలుసు...అతనికి కొత్తకాదు.

సరిగ్గా చదివావా నాయనా? మా వాడు నన్ను రమ్మని వ్రాయలేదూ? మా కోడలు నీళ్లు పోసుకున్నట్లు వ్రాశాడేమో. మరోసారి...జాగ్రత్తగా చదువుబాబూ ... నీకు పుణ్యముంటుంది. మా అబ్బాయి మరీయింత పొడిగా వ్రాయడే. చచ్చి నీ కడుపున పుడతాను, మరొక్కసారి చదవవూ?

ఆ ఉత్తరంలో ఏమీ ఉండవు—ఆమె ఆత్రతా అనుమానమే తప్ప. ఆ ముసిలావిడమీద జాలి వేస్తుంది. ఆ కొడుకుమీద కోపం వొస్తుంది. ఉత్తరంలో రాయని—అబద్ధాలు చదివేద్దామా అన్నంతగా మనసు కరిగిపోతుందావిడ పరిస్థితినీ దైన్యాన్నీ చూస్తూంటే. కాని అది తప్పనిపిస్తుంది. ఇప్పటికే డ్యూటీనిమించి చేస్తున్నాడు. అతను పనిలో అబద్ధాలాడడం ఒకటా?

పోస్టుమాన్ జారుకున్నాడు—ఆవిడ పరధ్యానంగా ఉండడం చూసి.

పార్వతమ్మ కనులు తుడుచుకుంది. ఎదురుగా...దూరంగా ఎండలో...రోడ్డుమీద.. వెన్నెల్లో అంత హాయిగానూ ఆడుకుంటున్న పిల్లలు. వాళ్లకి ఎండ అనిపించడంలేదూ?

అడ్డాలనాడు పిల్లలు కాని—గెడ్డాలు వొచ్చాక పిల్లలా? కాదు కాదు. వాళ్లే నాటికీ పిల్లలే. ఆ తప్పు—వాళ్లది అయిఉండదు. కనిపెంచిన అమ్మదే ఐ ఉంటుంది. తెలిసో తెలియకో ... ఎక్కడో ఏదో లోపం.. పొరపాటు. చేసి ఉంటుంది తల్లి. దానికి శిక్ష — తరువాత ఎప్పుడో అనుభవిస్తూ—బిడ్డని తప్పు పడుతుంది తను చేసినది మరచి. అంతే తప్ప - పిల్లలకి అమ్మా...అమ్మకి బిడ్డలూ దూరమౌతారా? రక్తబంధం ఓ పట్నాన దూరం కానిస్తుందా?

తను రఘుకి చేసిన అపచారమేమిటి? వాడికెందుకింత కోపంగా ఉంది అమ్మమీద? వొచ్చి తనతోనే ఉండమని ఒక్క ఉత్తరంలోనూ వ్రాయడేం? అసలు—ఉత్తరాలే పున్నానికో అమావాస్యకో తప్ప రాసి పడెయ్యడేం? తను మూడు నాలుగు వ్రాయిస్తే—వాడు ఒక్కటి వ్రాయడం గగనం. అదీ—పెళ్లాంచేత రాయించి చివరన తను సంతకం చేస్తాడు విధిలేనట్లు. తనకి చదువు బాగా రాదు కానీ వాడి చేతివ్రాత తనకి గుర్తే. అంత ఉత్తరమూ వాడే వ్రాస్తే చూసుకుని మురిసిపోదామనుకుంటుంది. కాని వాడలా వ్రాయడు. అమ్మమీద వాడి కెందుకింత కోపం?

ఓ నిముషం ఆలోచనలో పడింది పార్వతమ్మ. జీవితంలోకి—ఆలోచనలూ జ్ఞాపకాలూ పడవ కట్టుకుని—వెనక్కి వెళ్లింది అతి జాగ్రత్తగా. అలాగ గతాన్ని పునరావలోకనం గావించుకునేసరికి ఆమెకేదో తట్టింది. ఇంక ఆమె ఆలస్యం చేయదలుచుకోలేదు క్షణమయినా. అంత ఎండలోనూ—బయలుదేరింది, నాలుగిళ్ల అవతలి నారాయణమ్మగారింటికి. వాళ్ల మనవడు హరి బుద్ధిమంతుడు. అడిగితే కాదనడు. రమ్మంటే రాననడు. ఎన్ని చిన్న చిన్నసాయాలు చేసిపెట్టడం లేదింతవరకూ? ఆ కుర్రాడి రాత కూడా చక్కగా ముత్యాల కోవలా ఉంటుంది.

అతన్ని బ్రతిమాలుకుని యింటికి తీసుకువొచ్చింది. కాగితమూ కలమూ అతనే తెచ్చాడు. కళ్లు మూసుకుని-ధ్యానంలోలాగ ఉండి-మెల్లగా చెప్పసాగింది.

''నాయనా రఘూ! ... ఇన్నాళ్ళూ నేను గ్రహించలేకపోయాను. నేను చేసిన పొరపాటూ నీకు నామీద కోపానికి కారణమూ. విషయం తెలిస్తే నువ్వు యీ అమ్మని క్షమించగలవనే ఆశ. చిన్నప్పుడు నువ్వు మందకొడిగా ఉండేవాడివి. అలాగని అనారోగ్యమూ కాదు. చురుకుదనం తక్కువ. దానికి వైద్యుడు చెప్పిన పద్ధతి-నీలో కదలికలు బలవంతంగా ఐనా కలిగించమని. నెలల పిల్లడివి. నన్ను పట్టుకు వదిలేవాడివి కావు ఒక్కక్షణమైనా ... నీకు పాకడం నేర్పడానికి నేను నీకు దూరంగా జరిగేదాన్ని. నీకందకుండా...అందినట్లే అంది దూరమౌతూ . పాకడం... తరవాత నడక...పరుగుకూడా అలాగే నేర్పాను. కొంచెం పెద్దయ్యావు. అది తెమ్మనీ యిది తెమ్మనీ అటూ యిటూ పంపేదాన్ని. సాయంత్రం ఆటలాడుకుందుకు పొమ్మనేదాన్ని. ఇంట్లో-నీకు దూరంగా ఉండి పరుగెత్తుకు రమ్మనేదాన్ని. నీకు దొరక్కుండా దూరమయ్యేదాన్ని. నిన్ను దూరదూరంగా పరుగు తీయించేదాన్ని. అది-నీ ఆరోగ్యమూ అవయవాలూ సక్రమంగా అయ్యేందుకు వైద్యుడు చెప్పిన విధానం అనుసరించడమే తప్ప నిజంగా నిన్ను దూరం చేసుకోవాలనీ నీకందకూడదనీ కాదు. నువ్వెంత దూరంగా పరుగెడుతూంటే అంత ఆనందంగా ఉండేది నా కప్పుడు. అందుకే-బజారుకనో మరో పని అనో నిన్ను దూరంగా పంపేదాన్ని. అది-నువ్వంటే యిష్టమూ ప్రేమా లేకకాదు...నిన్నూ నలుగురితోనూ సమంగా తయారు చేయాలని.

ఇప్పుడు-నేను ముసిలి దాన్నయిపోయాను. నువ్వేమో నాకు దూరంగా అతి దూరంగా పరుగెడుతున్నావు నిన్ను నేనందుకోగలనా బాబూ? అప్పుడు నీకు నేను నేర్పిన పరుగు-యిప్పుడు నామీద ప్రయోగించకు. నేను నిన్ను చేరలేను. బాబూ, ఆవేళ... ఆ రోజుల్లో ఎంతగా వేడుకున్నానో నీకు పరుగు రావాలని!...ఇప్పుడు అంతగానూ కోరుకుంటున్నాను నువ్వు నాకు దూరంగా పరుగెత్తకుండా అతి దగ్గరగా రావాలని. అప్పుడు నువ్వు పరుగెత్తి నన్నందుకోగలిగేవాడివి కానీ యిప్పుడు నేను నడవడానికీ అశక్తురాలినే. అర్థం చేసుకుని – యీ అమ్మని దగ్గరగా తీసుకోవూ ఆగ్రహం మాని? నీమీది బెంగతో ఎంత క్రుంగి కృశించిపోతున్నానో! ఒక్కసారి వొచ్చి కనిపించవూ నా కన్నుల పండుగగా? అప్పుడు నిన్ను దూరంగా పరుగెత్తించిన దానికి పరిహారంగా యిప్పుడు నన్ను దూరంగా ఉంచకు. ఇంక పెద్ద వాడి వయ్యావు. దూరపు పరుగులు వొద్దు. దగ్గరగా రా...''

నీకు చేరువ కావాలని పరితపిస్తున్న అమ్మ.

అంతే అన్నట్లు ఆగిందావిడ. మూసుకున్న ఆమె కన్నుల నుండి ఆగకుండా కన్నీరు. రఘు పరుగు అతని వయసుదీ వాతావరణానిదీ అని ఆ వృద్ధురాలికి తెలియదు.

హరి-కాగితాన్ని కవరులో పెట్టబోతూ-చిత్రమైన ఆ ఉత్తరాన్ని అదోలా చూశాడు.

~~~~~~

# బతుకు

## జింబో

నే
  చచ్చిపోతాననే కదూ
నీ
బాధ
పిచ్చివాడా —
ఈ వ్యవస్థలో
మనం బతికింది
తొమ్మిది మాసాలే.

—: ० :—

# ఆర్తి

## శ్రీ గోవిందరాజు రామకృష్ణరావు

పిలవనిదే
  'ఓయ్' అన్నది ఎవరు ?
నీవే అయివుంటావు
ఓ ప్రభూ !
అంతటి
ఆర్తి ఎవరికుంటుంది ?
కంటికి రెప్పలా కాపాడే
నీకు తప్ప !

—: ० :—
~~~~~~